నేనున్నాననే భరోసా కల్పించే నాయకుడు కేసీఆర్

- 1న జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు లక్షలాదిగా తరలిరండి..
- గడపగడపకూ పథకాలు తీసుకెళ్లాలి
- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- మూడు మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎంపీలు నామా, బండి, ఎమ్మెల్యే సండ్ర

మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య, ఎంపీ బండి, నల్లమల

కల్లూరు, అక్టోబర్ 19: దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన చరిత్ర కేసీఆర్‌ది అని, మాట ఇస్తే ఎంత రిస్క్ చేసేనా ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించే నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. గురువారం కల్లూరు మెయిన్‌రోడ్ పక్కన కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యతో కలిసి పాల్గొని మాట్లాడారు. అమ్మ అయినా అడిగితే అన్నం పెడుతుంది...కానీ తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో బృహత్తర సంక్షేమ పథకాలను అందించి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీసుకువెళ్లిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది కేసీఆరే అన్నారు. నవంబర్ 1న కల్లూరులో చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాఆశీర్వాద బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా సీఎం కేసీఆర్ ఉన్నారని, ఎంత వ్యయాన్ని భరించైనా పేద ప్రజలకు అనుకున్నది అందించగల సత్తా కలిగిన నేత కేసీఆర్ అని అన్నారు. కష్టించి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు ఇస్తారని, బీఆర్ఎస్ గెలుపు కోసం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. సండ్రను అఖండ మెజార్టీతో గెలిపించి భవిష్యత్‌లో మంత్రి పదవి చేపట్టేలా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆ గెలుపును కానుకగా ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఆ గెలుపు ఆత్మవిశ్వాసంతోనే సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మరోమారు అభ్యర్థిగా నిలబడ్డానని...నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తనకు మరోమారు అవకాశం ఇవ్వాలన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేలా ప్రజలు మద్దతు పలకాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మూడు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు పాలెపు రామారావు, కనగాల వెంకట్రావు, రెడ్డెం వీరమోహనరెడ్డి, ఎంపీపీలు లక్కినేని అలేఖ్య, దొడ్డా శ్రీను, జడ్పీటీసీలు కట్టా అజయ్‌బాబు, చెక్కిలాల మోహనరావు, సొసైటీ చైర్మన్లు కీసర వెంకటేశ్వరరెడ్డి, బోబోలు లక్ష్మణరావు, కాటంనేని వెంకటేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, పెడకంటి రామకృష్ణ, నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో ఎమ్మెల్యే సండ్ర ప్రచారం

సత్తుపల్లి, అక్టోబర్ 19: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు 5వ వార్డు, 9.30కు 4వ వార్డు, 11గంటలకు 16, 17వార్డులు, 12.30 గంటలకు 3, 15 వార్డులు, 2 గంటలకు 1, 2 వార్డులు, 3 గంటలకు 13వ వార్డు, 4 గంటలకు 14వ వార్డు, 5 గంటలకు 12వ వార్డులో ప్రచారం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి పట్టణంలోని కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

రూ.7.82కోట్ల లాభాలతో ఆర్టీసీ ఖమ్మం రీజియన్

ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం వెంకన్న

మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న

సత్తుపల్లి, అక్టోబర్ 19: ఖమ్మం ఆర్టీసీ రీజియన్ గతేడాదిలో ఉన్న నష్టాలను అధిగమించి ఈ ఏడాది రూ.7.82కోట్ల లాభాలను ఆర్జించిందని ఖమ్మం రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న అన్నారు. గురువారం ఆయన సత్తుపల్లి డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడ్రన్ వాషింగ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు ఆర్టీసీ ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం రీజియన్ గతేడాది రూ.11కోట్ల నష్టాల్లో ఉందని, కానీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నష్టాలను అధిగమించి రూ.7.82కోట్ల లాభాలతో ప్రస్తుతం నడుస్తుందన్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆరు డిపోల అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితోనే ఈ లాభాలు వచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ ఏర్పాటు చేసిన గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌లో రాబోయే వంద రోజులు కీలకమని, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు ప్రయాణీకులను క్షేమంగా తమ స్వగ్రామాలకు చేర్చేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులు కృషిచేసి అధిక లాభాలు పొందేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఖమ్మం రీజియన్ లాభాల బాటలో పయనించడానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పీ విజయశ్రీ, ఏడీసీ మౌలానా, ఎంఎఫ్ సాహితీ, వెల్ఫేర్ బోర్డు సభ్యులు రేణుక, కిరణ్‌బాబు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 19: పట్టణంలోని విద్యానగర్ రోడ్డులో బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయం నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు చల్లగుళ్ల కృష్ణయ్య, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లూరు అంకమరాజు, నాయకులు బెల్లంకొండ రాము, మరికంటి శ్రీను, పంతంగి సాంబ, చింతల సత్యనారాయణ, అమరవరపు కృష్ణారావు, మదార్, పర్వతనేని వేణు, కోట రాజ్‌కుమార్, జొన్నలగడ్డ కృష్ణ, రమేశ్, డోజర్ నాగరాజు, గంధ్ర భార్గవ్‌రెడ్డి, క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జి కృష్ణ, దావూద్ పాల్గొన్నారు.

తపాలాశాఖలో అనేక పథకాలు

పెనుబల్లి, అక్టోబర్19: మండలంలోని వీఎం బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తపాలాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సత్తుపల్లి సబ్‌డివిజనల్ అధికారి(ఐపీవో) ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారి దగ్గర నుంచి వ్యాపారం చేసే వారి వరకు ఉద్యోగస్తులకు అనేక వర్గాల వారికి పోస్టాఫీసులో అనుకూలమైన పథకాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. తపాలాశాఖలో సేవింగ్, రికరింగ్ డిపాజిట్, మంత్లీ ఇన్‌కంస్కీం, సీనియర్ సిటిజన్, ఈపీఎఫ్ అకౌంట్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్ స్కీం, కిసాన్ వికాస్‌పత్ర, మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్లు పథకాలపై వివరించారు. ప్రతి కుటుంబానికి ఉపయోగపడే పథకాలు తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేంసూరు, అక్టోబర్19: బతుకమ్మ వేడుకలను మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. మహిళలు తిరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వాటిని గ్రామ కూడలి వద్ద, ఆలయ సమీపంలో ఒక చోట ఉంచి ఆడిపాడారు. అనంతరం గ్రామసమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

భార్యతో రమణయ్య(ఫైల్)

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 19: సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చి తిరిగి వెళుతూ ఆసుపత్రి ఎదుట ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. సీఐ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధుడు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స అనంతరం తిరిగి వెళుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఫుట్‌పాత్‌పై మృతిచెందిన ఉన్నాడు. అతని జేబులు పరిశీలించగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ చీటీలో నమోదు చేయించుకున్న పేరు ఏ రమణయ్యగా, వయస్సు 60గా రాసి ఉంది. మృత దేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చారు. ఆ ఫోటోలో వ్యక్తిని గుర్తించిన వారు 8712659167ను సంప్రదించాలని కోరారు.

రాజసాయి మందిరంలో ఎంపీ బండి పూజలు

పూజలు చేస్తున్న పార్థసారథిరెడ్డి

పెనుబల్లి, అక్టోబర్19: మండలంలోని వీఎం బంజరలోని రాజసాయి మందిరంలో గురువారం రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జెన్నారెడ్డి విజయ ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

పెనుబల్లి హండలంలోని వీఎం బంజరలోని శ్రీరాజసాయిమందిరంలో గురువారం దాతల వితరణతో గురువారం అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేయదల్చిన వారు ముందుగా ఆలయ కమిటీకి తెలపాలని కమిటీ చైర్మన్ జెన్నారెడ్డి విజయ తెలిపారు. తొలుత సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాదయాత్ర

పసుపు, కుంకుమలతో పాదయాత్ర చేస్తున్న మహిళలు, భక్తులు

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 19: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని రామాలయం నుంచి పట్టణ శివారులోని జేవీఆర్ పార్కు ఎదురుగా ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయం వరకు మహిళలు, భక్తులు పసుపు, కుంకుమలతో పాదయాత్ర నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. సరస్వతి అమ్మవారు లలితా త్రిపుర సుందరి అలంకారం నేపథ్యంలో 200 మంది మహిళలు మేళతాళాలతో పాదయాత్రగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొడిమెల అప్పారావు, ఎస్ఎల్ నర్సింహారావు, జగన్మోహనరావు, మాదిరాజు పుల్లారావు, రామప్ప, నాగభూషణం, ఎంఎస్ఆర్ శర్మ, సత్యనారాయణ, కోరుకొండ వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకుడు కిశోరశర్మ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

పెనుబల్లి: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెనుబల్లి, అక్టోబర్19: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలుగ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అమ్మవారిని ప్రతిరోజు ప్రత్యేకంగా అలంకరించి మహిళలు కుంకుమపూజలు చేస్తున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తల్లాడలో..

తల్లాడ, అక్టోబర్19: తల్లాడలోని కోటమైసమ్మ తల్లి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం అమ్మవారిని శ్రీఅన్నపూర్ణదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోలాట బృందానికి చీరెలు పంపిణీ

కోలాట బృందానికి చీరెలు అందజేస్తున్న దాతలు

తల్లాడ, అక్టోబర్19: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో వెంకట చలపతి దేవస్థాన కోలాట బృందానికి అయిలూరి శృతి (ఎస్-మార్ట్) తాత అయిలూరి పుల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆమె తల్లిదండ్రులు కృష్ణారెడ్డి, లీలావతి గురువారం చీరెలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ జానపద కళారూపాలలో ఒకటైన సాంప్రదాయ కళారూపం కోలాటం అని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి గ్రామంలో నిర్వహించిన కోలాటం పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బహుమతులు గెలుచుకొని గ్రామానికి మంచి పేరు తేవడం సంతోషకమరమన్నారు. కార్యక్రమంలో అయిలూరి రామకృష్ణారెడ్డి, అయిలూరి చలపతిరెడ్డి, పార్వతమ్మ, రామశేషిరెడ్డి, శీలం సత్యనారాయణరెడ్డి, చలపతిగౌడ్, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.